
ఏర్పాట్లను పరిశీలిస్తూ అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ దివాకర

## మహా శివరాత్రికి రామప్పలో ఏర్పాట్లు పూర్తి

### ములుగు కలెక్టర్ దివాకర టీఎస్

వెంకటాపూర్, ఫిబ్రవరి 24 : మహా శివరాత్రిని పురస్కరించుకొని రామప్పలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని కలెక్టర్ దివాకర టీఎస్ అన్నారు. సోమవారం సాయంత్రం ఆయన రామప్పను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించి మాట్లాడారు. 26వ తేదీ నుంచి జరిగే జాతరను పురస్కరించుకొని ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయడంతో పాటు పరిసరాలు శుభ్రంగా ఉంచేందుకు పారిశుధ్య కార్మికులను ఏర్పాటు చేశామన్నారు. ప్రత్యేక వైద్య శిబిరం, 24 గంటలపాటు వైద్య సిబ్బంది వైద్య సేవలందిస్తారన్నారు. జాగారం చేసే భక్తుల కోసం ఆలయ పరిసరాల్లో ప్రత్యేక ఎల్ఈడీ స్క్రీన్లను ఏర్పాటు చేశామన్నారు. రామప్ప చెరువు సందర్శనకు సాయంత్రం నుంచి అనుమతించవద్దని పోలీస్ అధికారులను ఆదేశించారు. వాహనాల పార్కింగ్, మరుగుదొడ్ల ఏర్పాటుతో పాటు స్వచ్ఛమైన నీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అనంతరం క్యూలైన్లు, కల్యాణం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించే స్టేజీలను పరిశీలించారు. అదనపు కలెక్టర్ సంపత్ రావు, ఆర్డీవో వెంకటేష్, డీఎస్పీ రవీందర్, ఈవో శ్రీనివాస్, డీఎంహెచ్వో గోపాల్‌రావు, ఇరిగేషన్ డీఈ రవీందర్, ఆయా శాఖల అధికారులు ఉన్నారు. అలాగే దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఆలయంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు ఈవో బిల్లా శ్రీనివాస్ తెలిపారు.



మాట్లాడుతున్న జడ్జి నారాయణబాబు

## కేసుల పరిష్కారానికి కృషి చేయాలి

### జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ నారాయణబాబు

భూపాలపల్లి రూరల్, ఫిబ్రవరి 24: జాతీయ లోక్ అదాలత్‌లో పెద్ద ఎత్తున కేసుల పరిష్కారం కోసం కృషి చేయాలని ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్, సెషన్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ నారాయణబాబు అన్నారు. సోమవారం న్యాయవాదులు, బ్యాంకు, ఇన్సూరెన్స్ కంపెనీల మేనేజర్లు, ఆర్టీసీ సూపరింటెండెంట్‌లతో నేషనల్ లోక్ అదాలత్ సమన్వయ సమావేశం నిర్వహించగా ఆయన హాజరై మాట్లాడారు. లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరించుకుంటే కలిగే లాభాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. మార్చి 8న జరగబోయే జాతీయ లోక్ అదాలత్‌లో ఇన్సూరెన్స్ కంపెనీలు, ఆర్టీసీలో పెండింగ్‌లో ఉన్న ప్రీ లిటిగేషన్ కేసులను పరిష్కరించుకోవాలన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కే జయరాంరెడ్డి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎన్ రామచంద్రారావు, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి జీ అఖిల, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మెరుగు రవీందర్, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ జీ ప్రియాంక, న్యాయవాదులు పాల్గొన్నారు.


ఓటు హక్కును వినియోగించుకుంటున్న ఓటర్లు

## ప్రశాంతంగా జీసీసీ పాలకమండలి ఎన్నికలు

మహదేవపూర్, ఫిబ్రవరి 24 : మండలకేంద్రంలోని మాడా విశ్రాంతి భవనంలో సోమవారం నిర్వహించిన జీసీసీ పాలక మండలి ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. మహదేవపూర్, కాటారం, మల్హర్, పలిమెల, మహాముత్తారం మండలాలకు చెందిన మొత్తం 1,086 ఓట్లు పోలయ్యాయని ఎన్నికల అధికారి శైలజ తెలిపారు. ఐదు పాలక మండలి ఎన్నికలకు రెండు మహిళా స్థానాలు ఏకగ్రీవం కాగా, మిగతా మూడు స్థానాలు ఎన్నికలు నిర్వహించారు. మహదేవపూర్‌కు చెందిన కాల్నేని రాములు 228 ఓట్లు, పోలంపల్లి గ్రామానికి చెందిన రామినేని వెంకటరాజం 232 ఓట్లు, పులిసే సమ్మయ్యకు 148 ఓట్లతో విజయం సాధించారని ఆమె తెలిపారు.

# ఎన్నికల విధులు సక్రమంగా నిర్వర్తించాలి

### భూపాలపల్లి జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ శర్మ

భూపాలపల్లి రూరల్, ఫిబ్రవరి 24 : ఎలాంటి పొరపాట్లు జరగకుండా ఎన్నికల విధులు సక్రమంగా నిర్వర్తించాలని జిల్లా ఎన్నికల అధికారి రాహుల్‌శర్మ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి కాటారం, భూపాలపల్లి డివిజన్ల పీవో, ఏపీవోలకు రెండో విడుత శిక్షణ కార్యక్రమం నిర్వహించగా కలెక్టర్ హాజరై మాట్లాడారు. సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు ముందు రోజే చేరుకుని ఓటర్ల జాబితా, బ్యాలెట్ పేపర్లు, బాక్సులు, ఎలక్షన్ సామగ్రిని పరిశీలించి పోలింగ్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. 26న ఉదయం ఐడీవోసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో పోలింగ్ సామగ్రి అందజేస్తామని తెలిపారు. 27న ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుందన్నారు. విధుల్లో పొరపాటు జరిగితే ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్, భూపాలపల్లి ఆర్డీవో రవి పాల్గొన్నారు. అలాగే పోలింగ్ నేపథ్యంలో 25వ తేదీ సాయంత్రం 4 గంటల నుంచి 27వ తేదీ సాయంత్రం 4 గంటల వరకు 48 గంటల పాటు సైలెన్స్ పీరియడ్ అమల్లో ఉంటుందని కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, గుంపులుగా ఉండటం, ప్రచారం, సోషల్ మీడియాలో ప్రచారం, బల్క్ ఎస్ఎంఎస్‌లు పంపడం కూడా నిషేధమని తెలిపారు. ఇతర జిల్లాల వ్యక్తులు ఉండొద్దని, ఎఫ్ఎస్టీ, ఎస్ఎస్టీ, ఎంసీసీ, పోలీస్ అధికారులు అప్రమత్తంగా ఉండి నిశిత పరిశీలించాలన్నారు. కల్యాణ మండపాలు, హోటళ్లు, లాడ్జిల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. ఒపీనియన్ పోల్, ఎగ్జిట్ పోల్స్ కూడా నిషేధమని తెలిపారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌శర్మ


హరీశ్‌రెడ్డి- ప్రత్యుషారెడ్డి దంపతులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్సీ కవిత, మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు జ్యోతి

## వధూవరులకు ఎమ్మెల్సీ కవిత ఆశీర్వాదం

కృష్ణకాలనీ, ఫిబ్రవరి 24: జిల్లాకేంద్రంలోని పుష్ప గ్రాండ్ ఫంక్షన్ హాల్‌లో సోమవారం నిర్వహించిన భారత జాగృతి జిల్లా అధ్యక్షుడు మాడ హరీశ్‌రెడ్డి–డాక్టర్ ప్రత్యుషారెడ్డి వివాహ వేడుకకు ఎమ్మెల్సీ, టీబీజీకేఎస్ గౌరవాధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు. రూ.2 లక్షల విలువైన రింగులను వారికి బహుమానంగా అందజేశారు. అలాగే మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి దంపతులు, మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్, దివ్యాంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ కేతిరెడ్డి వాసుదేవారెడ్డి నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలిపపారు. వారి వెంట బీఆర్ఎస్ భూపాలపల్లి అర్బన్, రూరల్ అధ్యక్షులు కటకం జనార్దన్ పటేల్, పిన్‌రెడ్డి రాజిరెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ గండ్ర హరీశ్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ చైర్మన్ బుర్ర రమేశ్, మాజీ ఎంపీపీలు కళ్లెపు రఘుపతిరావు, మందల లావణ్యా విద్యాసాగర్‌రెడ్డి, మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ నూనె రాజు, మాజీ కౌన్సిలర్లు జక్కం రవికుమార్, నాగుల శిరీషా దేవేందర్‌రెడ్డి, ముంజంపల్లి మురళీధర్, ఎడ్ల మౌనికా శ్రీనివాస్, ఏఎంసీ మాజీ చైర్మన్ పోలుసాని లక్ష్మీనర్సింహారావు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ పోరెడ్డి పూర్ణచంద్రారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు బీబీ చారి, మందల రవీందర్‌రెడ్డి, సింగనవేని చిరంజీవి, యుగేంద్రాచారి, టీబీజీకేఎస్ భూపాలపల్లి బ్రాంచ్ కమిటీ ఉపాధ్యక్షుడు బడితల సమ్మయ్య, నాయకులు అవినాశ్‌రెడ్డి, దేవరకొండ మధు, నరేశ్ నేత, ప్రవీణ్, నరేందర్, మహిళా నాయకులు తిరుపతమ్మ, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

## పన్నులు చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలి

భూపాలపల్లి రూరల్, ఫిబ్రవరి 24 : పట్టణంలోని ప్రజలు ఇంటి, నల్లా పన్నులు, ట్రేడ్ లైసెన్స్ ఫీజులు బకాయి లేకుండా చూసుకోవాలని మున్సిపల్ కమిషనర్ బిర్రు శ్రీనివాస్ అన్నారు. సోమవారం మంజూరునగర్‌లో రెవెన్యూ సిబ్బందితో కలిసి కమిషనర్ ఇంటి పన్నులు వసూలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలు పన్నులు బకాయి లేకుండా చూసుకోవాలన్నారు. ఇప్పటి వరకు పట్టణంలో 50 శాతం మాత్రమే పన్నులు వసూలయ్యాయన్నారు. రాష్ట్రంలో 100 శాతం పన్ను వసూలు చేసిన మున్సిపాలిటీగా భూపాలపల్లిని నిలిపేందుకు అందరూ సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ టీ రమేశ్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వీ భాస్కర్, బిల్ కలెక్టర్లు, వార్డు ఆఫీసర్లు, సహాయక సిబ్బంది పాల్గొన్నారు.


పన్ను చెల్లించిన వారికి రసీదు అందజేస్తున్న కమిషనర్ శ్రీనివాస్

## పీహెచ్‌సీని తనిఖీ చేసిన డిప్యూటీ డీఎంహెచ్‌వో

వెంకటాపురం (నూగూరు), ఫిబ్రవరి24 : మండలంలోని ఎదిర పీహెచ్‌సీని ఏటూరునాగారం ఐటీడీఏ డిప్యూటీ డీఎంహెచ్‌వో క్రాంతి కుమార్ సోమవారం తనిఖీ చేశారు. ప్రజలకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు 100 శాతం లక్ష్యం సాధించేలా కృషి చేయాలన్నారు. ఆయన వెంట వైద్యాధికారులు కిరణ్‌కుమార్, స్నేహ, డీపీఎంవో సత్యనారాయణ, సిబ్బంది ఉన్నారు. అలాగే చొక్కాల, రంగరాజుపురం, నూగూరు, వీరభద్రాపురం, అలుబాక గ్రామాల్లో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు నిర్వహించారు. వైద్యాధికారిణి స్నేహ ప్రజలకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించి సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు.


సిబ్బందికి సూచనలు చేస్తున్న క్రాంతికుమార్

## ఆర్ట్స్, క్రాఫ్ట్ మడ్ డే వేడుకలు

గణపురం, ఫిబ్రవరి 24: మండలకేంద్రంలోని ఫ్రాబెల్ మోడల్ హైస్కూల్‌లో సోమవారం ఆర్ట్స్, క్రాఫ్ట్ అండ్ మడ్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. నర్సరీ పీపీ 1, పీపీ 2 క్లాస్ విద్యార్థులతో రకరకాల పూలు, పండ్లు, ప్రకృతి, జంతువులు తదితర వాటిని ఆర్ట్స్ వేయించారు. అలాగే మట్టితో వివిధ రకాల పాత్రలు, దేవుడి బొమ్మ లు, రకరకాల వస్తువులు, ఇతర బొమ్మలను తయారు చేయించారు. టీచర్స్ నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ పిల్లలు నైపుణ్యాలు పొందేందుకు ఆర్ట్స్, క్రాఫ్ట్ నేర్పించారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఎల్ కృష్ణ, కరస్పాండెంట్ పబ్బ శివ శంకర్‌గౌడ్, డైరెక్టర్లు యాదగిరి, జగన్ పాల్గొన్నారు.


ఆర్ట్స్, క్రాఫ్ట్ మడ్ డే వేడుకల్లో చిన్నారులు, ఉపాధ్యాయులు

## ఆవు మృతికి అటవీ జంతువులు కారణం కాదు

మల్హర్, ఫిబ్రవరి 24 : మండలంలోని తాడిచెర్ల అటవీ ప్రాంతంలో ఆవు మృతికి అటవీ జంతువులు కారణం కాదని ఆ శాఖ అధికారులు తెలిపారు. సోమవారం కాపురం చెరువు ముందు మృతి చెందిన ఆవు మృతదేహం, సమీప ప్రాంతాల్లో ఎనిమల్ ట్రాకర్లతో అధికారులు గాలింపు చర్యలు చేపట్టారు. సమీప ప్రాంతాల్లో పెద్దపులి పాదముద్రలపై అన్వేషించారు. ఏవైనా ఇతర అడవి జంతువులు దాడి చేశాయా అని పరిశీలించగా ఆనవాళ్లు ఏమీ కనిపించలేదు. పొద్దంతా ఎనిమల్ ట్రాకర్లతో అడవిలో గాలించామని రేంజ్ అధికారి రాజేశ్వర్‌రావు తెలిపారు. ఒకటి, రెండు రోజుల్లో ఆవు ఈననుందని ఈ క్రమంలో మృతి చెంది ఉంటుందని చెప్పారు. పెద్దపులి దాడి చేసిన ఆనవాళ్లు లేవని, ప్రజలు భయాందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. సెక్షన్ అధికారి లక్ష్మణ్, బీట్ అధికారి మహేందర్ పాల్గొన్నారు.


పరిసరాలను పరిశీలిస్తున్న అటవీ శాఖ అధికారులు

## చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు భూమి సేకరణపై గ్రామ సభలు

కాటారం, ఫిబ్రవరి 24 : చిన్న కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా భూసేకరణ కోసం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్ ఆధ్వర్యంలో మండలంలోని జాదరావుపేట (రఘుపల్లె గ్రామం), వీరాపూర్ గ్రామ పంచాయతీలలో సోమవారం గ్రామ సభలు నిర్వహించారు. వీరాపూర్ చెరువు విస్తరణ కోసం జాదరావుపేటలో ప్రతిపాదిత 11 గుంటల భూమి, వీరాపూర్‌లో 22.4 ఎకరాల సేకరణకు గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాథమిక నోటిఫికేషన్ చదివి వినిపించడంతో పాటు, ప్రాజెక్ట్ ప్రభావిత రైతుల నుంచి అభ్యంతరాలను స్వీకరించారు. సంబంధిత అధికారులకు రైతుల అభ్యంతరాలను పరిశీలించి, పరిష్కార చర్యలు తీసుకునేలా సూచనలు చేశారు. తహసీల్దార్ నాగరాజు, అధికారుల బృందం పాల్గొన్నారు.


గ్రామ సభలో పాల్గొన్న డిప్యూటీ కలెక్టర్ మయాంక్‌సింగ్

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

★లేడీ టెలికాలర్స్, బ్యాగ్రౌండ్ వెరిఫికేషన్స్, కార్యాన్స్ వేసే అర్థిస్తులు వెంటనే కావలెను. సంప్రదించండి: 8074288199, హైదరాబాద్.
NT-329857

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలను ప్రకటించిన ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా పరిశీలించి ...

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777961
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

## లొంగిపోయిన మావోయిస్టు డివిజన్ కమిటీ సభ్యురాలు

### వివరాలు వెల్లడించిన ములుగు ఎస్పీ పీ శబరీశ్

ములుగు, ఫిబ్రవరి 24 (నమస్తే తెలంగాణ) : మావోయిస్టు పార్టీ డివిజన్ కమిటీ సభ్యురాలు పుల్సం పద్మ అలియాస్ ఉరే అలియాస్ గంగక్క లొంగిపోయినట్లు ఎస్పీ డాక్టర్ పీ శబరీశ్ సోమవారం తెలిపారు. సోమవారం ఆయన పద్మ వివరాలను వెల్లడించారు. మావోయిస్టు పార్టీలో పనిచేస్తున్న పద్మ దివంగత సెక్రటల్ కమిటీ సభ్యుడు, సీసీఎం, పొలిట్‌బ్యూరో సభ్యుడు కటకం సుదర్శన్ అలియాస్ ఆనంద్ భార్య అన్నారు. కన్నాయిగూడెం మండలం తుపాలకుగూడెం గ్రామానికి చెందిన పద్మ సీఆర్‌బీ ప్రెస్ టీమ్, డీకేఎస్‌జడ్‌సీలో డివిజన్ కమిటీ సభ్యురాలిగా పనిచేసిందని తెలిపారు. ఏటూరునాగారం దళం తరుచూ గ్రామానికి వచ్చి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించే వారని, పీడబ్ల్యూజీ సిద్ధాంతానికి ఆకర్షితురాలై 1998లో పార్టీలో చేరి 2001 వరకు ఏటూరునాగారం దళంలో సభ్యురాలిగా, 2004 మహిళా దళంలో, 2005లో ఆ దళం కమాండర్‌గా పనిచేసి అదే ఏడాది కటకం సుదర్శన్‌ను వివాహం చేసుకొని అతని రక్షణ విభాగానికి బదిలీ అయినట్లు చెప్పారు. 2007లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పెరుగుతున్న ఒత్తిళ్ల కారణంగా భర్తతో కలిసి డీకేఎస్‌జడ్‌సీకి బదిలీ అయి అదే సంవత్సరంలో ఏరియా కమిటీ సభ్యురాలుగా పదోన్నతి పొంది భర్త రక్షణ విభాగంలో డిప్యూటీ కమాండర్‌గా పనిచేసిందన్నారు. తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో అనేక హింసాత్మక ఘటనల్లో పాల్గొందని చెప్పారు. 2024 జూలైలో ద్విచక్రవాహనంపై ప్రమాదవశాత్తు పడిపోవడంతో ఎడమ చేతికి తీవ్ర గాయం అవడం, ఆరోగ్య సమస్యలు పెరగడంతోపాటు పార్టీ కష్టాలను తట్టుకునేందుకు శారీరకంగా సామర్థం కోల్పోయి లొంగిపోయినట్లు తెలిపారు. మిగతా మావోయిస్టు పార్టీ నాయకులు, సభ్యులు పోలీసుల ఎదుట లొంగిపోవాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు. వారికి రివార్డుతో పాటు ప్రభుత్వ పునరావాసం కల్పించి అన్ని విధాలుగా ఆదుకుంటామన్నారు. సమావేశంలో ఓఎస్డీ గీతే మహేశ్‌బాబాసాహెబ్, డీఎస్పీ రవీందర్, సిబ్బంది పాల్గొన్నారు.


పద్మ వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ శబరీష్

## బాధిత కుటుంబాలకు పుట్ట మధు పరామర్శ


మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న పుట్ట మధు

కాటారం, ఫిబ్రవరి 24: మండలంలోని పరికిపల్లి గ్రామంలో ఇటీవల మృతి చెందిన దుర్గం బక్కయ్య, దుర్గం రాజయ్య కుటుంబాలను సోమవారం రాత్రి మంథని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి పుట్ట మధుకర్ పరామర్శించారు. వారి మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆదివారంపేట గ్రామం లో అనారోగ్యంతో బాధపడుతున్న సూరం రాజబాబును పరామర్శించి ఆరోగ్య పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ జిల్లా నేత జక్కు రాకేశ్, మండల ఇన్‌చార్జి జోడు శ్రీనివాస్, యూత్ మండల అధ్యక్షుడు రామిళ్ల కిరణ్, పంతకాని సడువలి, కొండగొర్ల వెంకటస్వామి, గాలి సడువలి, శ్రీలక్ష్మి, జక్కు శ్రవణ్ , రామిల్ల రాజు, రత్న రమేశ్‌రెడ్డి , దుర్గం రాజేశ్, దానం సమ్మయ్య, గంట సమ్మయ్య, ఉన్నారు.

## సండ్రపల్లిలో ఉచిత వైద్య శిబిరం

మహదేవపూర్ (కాళేశ్వరం), ఫిబ్రవరి 24 : మండలంలోని సండ్రపెల్లి గ్రామంలో కాళేశ్వరం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 33 మందిని పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ సుస్మిత, పీహెచ్ఎన్ నీరజ, హెల్త్ అసిస్టెంట్ అడప రాజ రమణయ్య, ల్యాబ్ టెక్నీషియన్ శ్రీనివాస్, ఏఎన్ఎం విజయ, ఆశ వర్కర్స్ జరీనా, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.


వైద్య పరీక్షలు చేస్తున్న మెడికల్ ఆఫీసర్ సుస్మిత

## గోదావరిలో మునిగి వృద్ధుడి మృతి

మహదేవపూర్ (కాళేశ్వరం), ఫిబ్రవరి 24 : కాళేశ్వరం గోదావరి నదిలో ప్రమాదవశాత్తు మునిగి వృద్ధుడు మృతి చెందాడు. ఎస్సై తమాషారెడ్డి కథనం మేరకు.. చిట్యాల మండలం నవాబుపేట గ్రామానికి చెందిన పంజాల రామన్న (75 ) ఆదివారం ఇంట్లో చెప్పకుండా కాళేశ్వరం వచ్చి గోదారి నదిలో స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తు మునిగి మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

## జేఏసీ నాయకుల అరెస్టు అన్యాయం

గణపురం, ఫిబ్రవరి 24 : ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి మంచిర్యాల పర్యటనకు వస్తే టీవీ ఏసీ జేఏసీ నాయకులను అరెస్టు చేయడం అన్యాయమని జేఏసీ చైర్మన్ అల్లం ఓదెలు, కన్వీనర్ బీరెల్లి రాజు అన్నారు. సోమవారం వారు మాట్లాడుతూ రాష్ట్ర నాయకులు సదానందం, తిరుపతి, వెంకటేశ్, దేవేందర్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 20న జరిగిన ఛలో విద్యుత్ సౌధ కార్యక్రమంలో కూడా రాష్ట్ర ప్రభుత్వం ఇదే వైఖరి అవలంబించిందని, ముఖ్యమంత్రి ఏ జిల్లాకు వెళ్తే ఆ జిల్లాలోని జేఏసీ నాయకులు అరెస్ట్ చేయడం సరికాదన్నారు. ఎంత మందిని అరెస్టు చేసినా ఆర్టిజన్స్ కన్వర్షన్ సాధించే వరకూ పోరాటం కొనసాగిస్తామన్నారు. ప్రభుత్వం తక్షణమే చర్చలకు పిలిచి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.

## గిరిజన సొసైటీ ద్వారానే ఇసుక క్వారీలు నిర్వహించాలి

ఏటూరునాగారం, ఫిబ్రవరి 24 : ఆదివాసీ ప్రాంతాల్లో గిరిజన సొసైటీల ద్వారానే ఇసుక క్వారీలను నిర్వహించాలని గిరిజన ఇసుక కో ఆపరేటివ్ సొసైటీ ఫెడరేషన్ జిల్లా కన్వీనర్ ఈసం రాజు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆదివాసీలకు కేటాయించే వరకు జేఏసీలతో కలిసి ఉద్యమం చేపడుతామన్నారు. గిరిజన ఇసుక సొసైటీలకు క్యూబిక్ మీటర్‌కు రూ.450 చెల్లించి ఐటీడీఏల ద్వారా క్వారీలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. అవసరమైన యంత్రాలు, మిషనరీ సమకూర్చుకునేందుకు ఆర్థిక సాయం అందించాలని కోరారు. వచ్చే ఆదాయం పెసా చట్టం ప్రకారం అభివృద్ధికి ఖర్చు చేయాలన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి గిరిజనులకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు.

## ద్విచక్ర వాహనం ఢీకొని ఒకరి మృతి

టేకుమట్ల, ఫిబ్రవరి 24 : ద్విచక్ర వాహనం ఢీకొని ఒకరు మృతి చెందిన ఘటన మండలంలోని అంకుషాపూర్‌లో ఆదివారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. సోమనపల్లి గ్రామానికి చెందిన మారపెల్లి రాజకొమురయ్య(65) ఆదివారం రాత్రి టేకుమట్లకు నడుచుకుంటూ వెళ్తున్నాడు. అంకుషాపూర్ యాదవకాలనీ సమీపంలోకి వెళ్లగానే, అదే గ్రామానికి చెందిన బిక్కనూరు సతీశ్ టేకుమట్ల నుంచి అంకుషాపూర్‌కు బైక్‌పై వస్తూ రాజకొమురయ్యను ఢీకొట్టి వెళ్లిపోయాడు. తీవ్రగాయాలైన రాజకొమురయ్యను గమనించిన బాటసారులు 108 వాహనంలో చిట్యాల ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలించగా పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి భార్య సమ్మక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు.

## అటవీ అధికారులపై చర్యలు తీసుకోవాలి

వెంకటాపురం (నూగూరు), ఫిబ్రవరి 24 : ఆదివాసీలపై దాడులకు పాల్పడుతున్న అటవీ శాఖ అధికారులపై ఎస్సీ, ఎస్టీ కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని ఆదివాసీ నాయకులు కొర్స నర్సింహమూర్తి, ఉయిక శంకర్, పూనెం సాయి ప్రభుత్వాన్ని కోరారు. ఇటీవల అటవీ శాఖ అధికారుల చేతిలో దాడికి గురైన ఏకన్నగూడెం గ్రామానికి చెందిన కోరం సమ్మయ్యను సోమవారం వారు పరామర్శించారు. గిరిజనుడైన సమ్మయ్య గృహ అవసరాల నిమిత్తం అడవి నుంచి కలపను తరలిస్తుండగా భౌతిక దాడికి దిగి పక్కటెముకలు విరిగే విధంగా కొట్టారని అన్నారు. చట్టాన్ని చేతిలోకి తీసుకున్న అటవీ శాఖ అధికారులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని, లేకపోతే చెర్ల రేంజ్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

## సున్నం బట్టి వీధిలో చోరీ

వెంకటాపురం (నూగూరు), ఫిబ్రవరి24 : మండలకేంద్రంలోని సున్నం బట్టి వీధిలో ఇంటి తాళాలు పగులగొట్టి చోరీకి పాల్పడిన ఘటన సోమవారం జరిగింది. బాధితుడు కృష్ణ కథనం ప్రకారం.. ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళాలు పగలగొట్టి బీరువాలో ఉన్న నల్లపూసల గొలుసు, బంగారు ఆభరణాలు, రూ.10వేల నగదు ఎత్తుకెళ్లారు. కుటుంబ సభ్యులు నాలుగు రోజుల క్రితం పనిమీద ఊరు వెళ్లారని, ఇంట్లో ఎవరూ లేని సమయంలో దొంగతనం జరిగిందని తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి వివరాలను సేకరించారు.

## ఆలయ అభివృద్ధికి నగదు వితరణ

గణపురం,ఫిబ్రవరి 24 : స్థానిక పట్టాభి సీతారామచంద్ర స్వామి దేవాలయ అభివృద్ధికి మండలకేంద్రానికి చెందిన దూలం సంజన, తిరుపతిగౌడ్ దంపతులు సోమవారం రూ.10.016 ఆలయ కమిటీ అధ్యక్షుడు తాళ్లపల్లి గోవర్ధన్‌కు అందించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేసిన వారికి అర్చకులు ముసునూరి నరేశ్ తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మూల శ్రీనివాస్‌గౌడ్, బండారు శంకర్, బటిక స్వామి, దయ్యాల భద్రయ్య, మాదాసు అర్జున్, బూర రాజగోపాల్, మాదాసు మొగిలి, పాండవుల భద్రయ్య పాల్గొన్నారు.


కిరాణా షాపులో తనిఖీలు చేస్తున్న ఎస్సై కృష్ణప్రసాద్

## స్నిఫర్ డాగ్ టీంతో తనిఖీలు

వాజేడు, ఫిబ్రవరి 24 : నార్కోటిక్ స్నిఫర్ డాగ్‌టీంతో పేరూరు, ధర్మవరం గ్రామాల్లో పోలీసులు తనిఖీలు చేశారు. ఎస్పీ శబరీష్, ఏఎస్పీ శివం ఉపాధ్యాయ ఆదేశాల మేరకు సోమవారం వెంకటాపురం సీఐ బండారు కుమార్ ఆధ్వర్యంలో పేరూరు ఎస్సై గుర్రం కృష్ణప్రసాద్, పోలీస్ సిబ్బంది ఛత్తీస్‌గఢ్ నుంచి వచ్చిపోయే వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. స్థానిక కిరాణా షాపుల్లో సైతం సోదాలు చేశారు. మండలంలోఎవరైనా గంజాయి అమ్మినా, సేవించినా కఠిన చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు.